సాక్షి
విశాఖపట్నం
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025


ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట 8లో


స్టీల్‌ప్లాంట్‌లో వీఆర్‌ఎస్ ప్రక్రియ ఆరంభం 8లో


అదృశ్యమైన జ్యోతిష్యుడు.. అస్థిపంజరమై! 8లో

వైఎస్ జగన్‌తో కన్నబాబు భేటీ



సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు బుధవారం భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్‌గా కీలక బాధ్యతలు అప్పగించిన తర్వాత తొలిసారి ఆయన జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి, వాటిపై పోరాడాలని జగన్‌మోహన్‌రెడ్డి కన్నబాబుకు నిర్దేశించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఇంకా ఎండగట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్ని మరింత సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో 13 పోలింగ్ స్టేషన్లు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో 13 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రలో మొత్తం 21,555 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. విశాఖలో 5,277 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 2,403 మంది, స్త్రీలు 2,874 మంది ఉన్నారు. వీరి కోసం అన్ని మౌలిక సదుపాయాలతో మండలాల వారీగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు.

వాల్తేరా.. వద్దు బాబోయ్!



డీఆర్‌ఎంగా వచ్చేందుకు అధికారుల వెనకడుగు

- డీఆర్‌ఎం సౌరభ్‌పై సీబీఐ దాడుల తర్వాత అధికారుల గుండెల్లో దడ
- గతేడాది డిసెంబర్‌లో డీఆర్‌ఎంగా లలిత్‌బోరా నియామకం
- బాధ్యతలు చేపట్టకుండా వేరే ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నాలు
- ఇన్‌చార్జి డీఆర్‌ఎం పాలనలోనే కార్యకలాపాలు

సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు రైల్వే డివిజన్‌లో పనిచేసేందుకు ఉన్నతాధికారులు ఉలిక్కి పడుతున్నారు. సీబీఐ దాడుల్లో డీఆర్‌ఎం దొరికిన తర్వాత ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ సుముఖత చూపించడం లేదు. గతేడాది డిసెంబర్‌లో డీఆర్‌ఎంని నియమిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసినా ఆయన ఇంతవరకు బాధ్యతలు చేపట్టలేదు. ఇప్పుడు ఆయన వేరే చోటికి బదిలీ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు నెలలుగా ఇన్‌చార్జ్ నీడలోనే డివిజన్ వ్యవహారాలు నడుస్తుండటంతో రూ.వందల కోట్ల పనులకు చెందిన టెండర్లు స్తంభించిపోయాయి.

ఇన్‌చార్జి పాలనలో..

వాల్తేరు రైల్వే డివిజన్‌కు దాదాపు 130 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. 21 పాసింజర్ హాల్ట్‌లతో కలిపి మొత్తం 115 రైల్వే స్టేషన్‌లు డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఈస్ట్ కోస్ట్ జోన్‌లో సరకు రవాణాతో పాటు ప్రయాణికుల రాకపోకల ఆదాయంలోనూ వాల్తేరు డివిజన్ నంబర్‌వన్‌గా నిలిచింది. అలాంటి డివిజన్ ఇప్పుడు ఇన్‌చార్జి హయాంలో నడుస్తోంది. వాల్తేరు చరిత్రలో ఇన్ని నెలల పాటు ఇన్‌చార్జి డీఆర్‌ఎం పాలనలో నడవడం ఇదే ప్రథమమని ఉద్యోగులు చెబుతున్నారు. సీబీఐ దాడుల్లో పట్టుబడిన సౌరభ్‌కుమార్ స్థానంలో నవంబర్ 20న ఇన్‌చార్జి డీఆర్‌ఎంగా వాల్తేరు ఏడీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహూని నియమించారు. ఆ తర్వాత డిసెంబర్ 26న లలిత్‌బోరాని డీఆర్‌ఎంగా నియమిస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఇప్పటికీ ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. వాల్తేరు డివిజన్‌కు వస్తే తన పరిస్థితి ఏంటోనన్న భయం ఆయనలో పట్టుకుందని డివిజన్ అధికారులు చెబుతున్నారు. అందుకే ఆయన ముంబై లేదా ఇతర చోటుకి బదిలీ చేయాలంటూ ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బోర్డు కొత్తవారిని నియమించేందుకు ప్రయత్నిస్తోంది.

ఉద్యోగుల్లో భయాందోళనలు

ముంబైలో గతేడాది నవంబర్ 16న వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్ లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి డివిజన్‌లోని ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. డీఆర్‌ఎం వ్యవహారాలు చక్కబెట్టిన ఉద్యోగుల్లో ఒకరిని విజయనగరం బదిలీ చేసేశారు. మిగిలిన వారిని పలుమార్లు సీబీఐ అధికారులు విచారించి.. అనేక విషయాలపై ఆరా తీశారు. దీంతో ఉన్నతాధికారులు ఏ వ్యవహారంలో తలదూర్చితే ఏం జరుగుతుందో.. ఎప్పుడు తమని సీబీఐ విచారణకు పిలుస్తారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు.

రూ.వందల కోట్ల పనులకు బ్రేక్

ఘన చరిత్ర ఉన్న వాల్తేరు పరువుని లంచావతారం ఎత్తిన డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్ పట్టాలు తప్పించేశారు. సొంత అజెండాపైనే దృష్టిసారించిన ఆయన డివిజన్ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేశారు. ఆయన హయాంలో వచ్చిన కొత్త రైళ్లన్నీ.. గత డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి చేసిన ప్రతిపాదనలే తప్ప.. తన మార్కు అంటూ ఎక్కడా మచ్చుకు కూడా చూపించలేకపోయారు. అనూప్‌కుమార్ సత్పతి హయాంలో డివిజన్ ఆదాయంలోనూ, రైళ్ల రాకపోకల్లోనూ వెలుగొందింది. తర్వాత ప్రాభవం కనుమరుగైంది. పాతాళానికి పడిపోయిన డివిజన్‌లో డీఆర్‌ఎంగా ఎవరు బాధ్యతలు చేపడతారన్నదానిపై అంతటా సందిగ్ధత నెలకొంది. దీంతో పాటు ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో పెద్ద టెండర్లకు అనుమతులు ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. గత డీఆర్‌ఎం లంచాల మేత కారణంగా డివిజన్ పరిధిలో పనులకు టెండర్లు ఆహ్వానించినా ఎవరూ ముందుకురాలేదు. ఇప్పుడు శాశ్వత డీఆర్‌ఎం లేకపోవడంతో రూ.వందల కోట్ల పనులకు ఆగిపోయాయి. వీలైనంత త్వరగా డీఆర్‌ఎంని నియమించాలని రైల్వే యూనియన్లు కోరుతున్నాయి.

ఆరుగురు విద్యార్థినులకు అస్వస్థత


పెందుర్తి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు



- ఒకరి పరిస్థితి విషమం, ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు
- పెందుర్తిలోని ఇందిరా స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఫుడ్ పాయిజన్

పెందుర్తి : ఫుడ్ పాయిజన్ కారణంగా పెందుర్తిలోని ఓ నర్సింగ్ కళాశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వివరాలివి.. పెందుర్తి వెలంపేట సమీపంలో ఇందిరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి కళాశాల ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు స్నాక్స్, బిర్యానీ తిన్నారు. బుధవారం ఉదయం నుంచి వెన్నెల దివ్య, లలిత కుమారి, సంధ్య, వణుకుల మాధవి సహా ఆరుగురు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే వారిని 108లో పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో పెందుర్తి సీహెచ్‌సీకి వచ్చి విద్యార్థినులకు అందుతున్న చికిత్సను పర్యవేక్షించారు. మాధవి అనే విద్యార్థిని పరిస్థితి కాస్త ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయకర్త(డీసీహెచ్‌ఎస్) డాక్టర్ పి.శంకర్‌ప్రసాద్, సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అవంతి, వైద్యాధికారులు డాక్టర్ బి.బాబాసాహెబ్, డాక్టర్ దివ్య సౌజన్య, డాక్టర్ హరిత, హెడ్ నర్స్ లిల్లీ గ్రేస్, వైద్య సిబ్బంది విద్యార్థినుల ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తున్నారు.

కళాశాల వసతులపై డీఎంహెచ్‌వో సీరియస్

ఇందిరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ పరిసరాలు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థినుల హాస్టల్, మరుగుదొడ్లు, ఇతర పరిసరాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. తాగునీటి సదుపాయం కూడా పూర్తిస్థాయిలో లేదు. విద్యార్థినులకు కలుషిత నీరు అందుతున్నట్లు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు గుర్తించారు. కళాశాల నిర్వాహకులపై మండిపడ్డారు. ఇలాంటి పరిసరాల్లో కళాశాల, హాస్టల్ నిర్వహించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ చేపట్టాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


విద్యార్థిని 108లో తరలిస్తున్న సిబ్బంది


విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

హోం మంత్రి పీఎస్‌గా 'భూ'చోడు?

- విశ్వప్రయత్నాలు చేస్తున్న అధికారి
- అందుకు మంత్రి అనిత గ్రీన్ సిగ్నల్
- గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే తహసీల్దార్‌గా పనిచేసిన అధికారి
- ఎస్.రాయవరంలో భూరికార్డుల తారుమారు విషయంలో ఆరోపణలు
- మళ్లీ అనిత వద్దే పీఎస్‌గా ప్రయత్నాలపై అనేక అనుమానాలు



విశాఖ సిటీ: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు వ్యక్తిగత కార్యదర్శి(పీఎస్) నియామకం చర్చనీయాంశమవుతోంది. రెవెన్యూలో చక్రం తిప్పే ఒక తహశీల్దార్ పీఎస్‌గా వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. భూ వ్యవహారాల్లో ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిని తన పీఎస్‌గా తెచ్చుకునేందుకు హోంమంత్రి కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అనకాపల్లి జిల్లాలో భారీ ప్రాజెక్టులకు భూ సమీకరణ జరుగుతున్న నేపథ్యంలో అతని చాతుర్యం అవసరమని అనిత భావిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే గతంలో అనిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎస్.రాయవరం మండలంలో భూ రికార్డుల మార్పుల విషయంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న అధికారినే మళ్లీ తన పీఎస్‌గా నియమించాలనుకోవడం గమనార్హం.

ప్రభుత్వమేదైనా కీలక పోస్టింగ్‌లే..!

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సదరు తహసీల్దార్ మాత్రం నచ్చిన పోస్టింగ్ తెచ్చుకోవడంలో సిద్ధహస్తుడు అన్న టాక్ రెవెన్యూ విభాగంలో ఉంది. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలను బుట్టలో వేసుకొని కీలక మండలాల్లో ఇప్పటి వరకు విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ప్రస్తుతం విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ)లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడి నుంచి హోం మంత్రి పీఎస్‌గా వెళ్లేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి మంత్రి అనితే సదరు అధికారిని తన పీఎస్‌గా నియమించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

అప్పట్లోనే ఆరోపణలు

సదరు అధికారి ఎస్.రాయవరం మండలం తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలోనే అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యేగా వంగలపూడి అనిత ఉన్నారు. ఒక భూ వ్యవహారంలో రికార్డులు మార్చడానికి భారీగా డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనిపై తలారీ స్వయంగా ఆరోపణలు చేస్తున్న వీడియో సైతం వైరల్ అయింది. మళ్లీ ఇపుడు అనిత సదరు అధికారినే వ్యక్తిగత కార్యదర్శిగా తీసుకోవాలనుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

భూ వ్యవహారాలు చక్కబెట్టేందుకేనా..?

అనకాపల్లి జిల్లాలో కీలక భారీ ప్రాజెక్టులు రానున్నాయి. ప్రధానంగా పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌తో పాటు అదే మండలంలో బల్క్ డ్రగ్ పార్కు రానుంది. ఇందుకు సంబంధించి పెద్ద ఎత్తున భూ సమీకరణ ప్రక్రియను చేపట్టారు. ఇంకా భారీగా భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో హోం మంత్రి అనిత సదరు తహసీల్దార్‌ను తన పీఎస్‌గా నియమించుకోడానికి వెనుక భూ వ్యవహారాలు చక్కబెట్టుకునేందుకే అన్న వాదనలు ఉన్నాయి. గతంలో సదరు అధికారిపై ఆరోపణలు ఉన్నప్పటికీ.. మళ్లీ అతడినే ఏరికోరి తెచ్చుకోవాలని చూస్తుండడం వెనుక గల కారణాలపై సొంత పార్టీలోనే నేతలు చెవులు కొరుక్కుంటున్నారు.

సత్వర న్యాయఫలాలకు మధ్యవర్తిత్వం మేలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : కక్షిదారులకు సత్వర న్యాయఫలాలు అందించే ప్రక్రియలో మధ్యవర్తిత్వాన్ని అనుసరించడం ఎంతో మేలు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. మధ్యవర్తిత్వ శిక్షణా శిబిరం ముగింపు, మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కి సంబంధించి సమన్వయ కమిటీల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక శాతం కేసులు రాజీ చేయాలని కమిటీ సభ్యులను, న్యాయవాదులను, వివిధ కంపెనీల ప్రతినిధులను కోరారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించడం ఉభయులకు లాభదాయకమన్నారు. కేసుల రాజీకి న్యాయవాదులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధా రాణి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వెంకటరమణ, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, విశాఖ న్యాయవాదుల సంఘం కార్యదర్శి తాళ్లూరు రవికుమార్ పాల్గొన్నారు.

స్టేషన్లలో వదిలేసిన 152 వాహనాల అప్పగింత

రాష్ట్రంలోనే తొలిసారిగా వెహికల్ రిటర్న్ మేళా నిర్వహణ

విశాఖ సిటీ : ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ దీర్ఘకాలంగా పోలీస్‌స్టేషన్లలో వదిలేసిన వాహనాలను గుర్తించి వాటిని సంబంధిత యజమానులకు అప్పగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా వెహికల్ రిటర్న్ మేళాను బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలీస్‌స్టేషన్లను సందర్శించిన సమయంలో అక్కడ అనేక బైక్‌లు ఉండడాన్ని గమనించినట్లు తెలిపారు. చాలా కాలంగా వాటి యజమానులు స్టేషన్లలో వదిలివేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పీఎం పాలెంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌లో కూడా అనేక వాహనాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వాటిని సంబంధిత యజమానులకు అప్పగించేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖలో వెహికల్ రిటర్న్ మేళా నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. యజమానులు లేని వాహనాల తొలగింపుతో పాటు వేలం ప్రక్రియకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.


యజమానికి వాహన పత్రాన్ని అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

1,149 వాహనాల గుర్తింపు

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్లలో మొత్తంగా 1,149 వాహనాలను గుర్తించినట్లు చెప్పారు. పోలీస్ థర్డ్ ఐ, ఆర్టీవో ద్వారా 559 వాహనాల యజమానుల చిరునామా సేకరించామన్నారు. అందులో 272 మంది యజమానులను గుర్తించగా తొలి దశలో 152 వాహనాలను వాటి యజమానులకు అందజేశారు. మరోసారి ఈ మేళా నిర్వహిస్తామన్నారు. యజమానులు లేని వాహనాల వేలం కోసం కోర్టులో పిటిషన్ ఫైల్ చేస్తామని తెలిపారు.

సర్వర్ డౌన్: రిజిస్ట్రేషన్లకు అంతరాయం

మహారాణిపేట: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సర్వర్ డౌన్ కావడం వల్ల రిజిస్ట్రేషన్లకు తీవ్ర అంతరాయం కలిగింది. సర్వర్‌లో సాంకేతిక సమస్య వల్ల సాయంత్రం వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగలేదని అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు రాత్రి వరకు పడిగాపులు కాశారు.

స్టీల్‌ప్లాంట్‌లో వీఆర్‌ఎస్ ప్రక్రియ ఆరంభం

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్) అమలు ప్రక్రియ ప్రారంభమైంది. కొంతమందికి సంబంధించి వీఆర్‌ఎస్ ఆమోదం, తిరస్కరణ నోటీసులు విడుదలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల తగ్గింపు కార్యక్రమంలో భాగంగా గత నెల 15న యాజమాన్యం వీఆర్‌ఎస్ నోటిఫికేషన్ జారీ చేసింది. జనవరి 31వ తేదీ నాటికి 1,613 మంది ఉద్యోగులు (అధికారులు, కార్మికులు కలిపి) వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేశారు. సుమారు 145 మంది దరఖాస్తుల ఉపసంహరణకు వినతులు అందజేశారు. అప్పటి నుంచి యాజమాన్యం వడపోత కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా నాన్ వర్క్స్ విభాగాలకు చెందిన కార్మికులు, ఈ–4 గ్రేడ్ స్థాయి వరకు అధికారులకు సంబంధించి 18 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు అంగీకరించినట్టు ఈపీఎస్‌ఎస్ పోర్టల్లో పొందుపరిచారు. ఇక ఈ–5, ఆపై అధికారుల జాబితా విడుదల కావాల్సి ఉంది. అదే విధంగా వర్క్స్‌కు సంబంధించిన విభాగాల కార్మికులు, అధికారుల జాబితా గురువారం విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం. నోటీసులు ఉద్యోగులకు అందిన నాటి నుంచి నోటీసు పిరియడ్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు. క్యాజువల్ లీవ్, ఆప్షనల్ హాలిడేలు నిష్పత్తి ప్రాతిపదికన మాత్రమే వినియోగించుకోవాలని, నోటీసు పీరియడ్‌లో అర్జిత సెలవులు (ఈఎల్), సగం అర్జిత సెలవులు (హెచ్‌పీఎల్)లు వినియోగించుకోరాదని తెలిపారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



బయోడైవర్సిటీ పార్క్‌లో అటవీ శాఖ శిక్షణ అధికారులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను బుధవారం రాష్ట్ర అటవీ శాఖ శిక్షణ అధికారులు సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అకాడమీ రాజమహేంద్రవరంలో శిక్షణ పొందుతున్న 60 మంది అధికారులు పార్క్‌లోని మొక్కలను పరిశీలించారు. వివిధ రకాల అరుదైన మొక్కల విశేషాలు, వాటి పరిరక్షణ గురించి వారికి పార్క్ నిర్వాహకుడు రామామూర్తి వివరించారు. అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ శాంతి స్వరూప్, డీఎఫ్‌వో రమణ మూర్తి పాల్గొన్నారు.

అదృశ్యమైన జ్యోతిష్యుడు..

అస్థిపంజరమై!

- పెందుర్తికి చెందిన మోతి అప్పన్నగా గుర్తింపు
- చెల్లా చెదురుగా ఎముకలు, పుర్రె
- హత్య కోణంలో పోలీసుల దర్యాప్తు
- కాపులుప్పాడలో కలకలం



వివరాలు సేకరిస్తున్న నార్త్ ఏసీపీ అప్పలరాజు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు కాపులుప్పాడలో అస్థిపంజరం కలకలం రేపింది. సంఘటనా స్థలంలో పూసలు, సగం కాలిన దుర్గాదేవి ఫొటో, పంచె ఆధారంగా.. ఈ అస్థిపంజరం పెందుర్తికి చెందిన జ్యోతిష్యుడు మోతి అప్పన్న(50)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి ఆయన్ని ఇక్కడకు తీసుకుని వచ్చి.. హత్య చేసి, అనంతరం కాల్చి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు భీమిలి సీఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివీ.. పెందుర్తి బీసీ కాలనీకి చెందిన మోతి అప్పన్న.. భార్య కొండమ్మ, కుమారులు ప్రసాద్, దుర్గా ప్రసాద్‌లతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయనకు అఖిల, భారతి అనే కుమార్తెలు కూడా ఉన్నారు. వీరికి వివాహం అయింది.

9న ఇంటి నుంచి బయటకు వెళ్లి..

వృత్తి రీత్యా ఇంటింటికి వెళ్లి జ్యోతిష్యం చెప్పే అప్పన్న ఈ నెల 9న ఆనందపురం వెళ్తానని ఇంటి వద్ద చెప్పాడు. ఆ రోజు రాత్రి అప్పన్న ఇంటికి తిరిగి రాలేదు. ఈ నెల 10న ఆయన పెద్ద కుమారుడు దుర్గా ప్రసాద్ ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో తన తండ్రి కనిపించట్లేదని ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి భీమిలి, ఆనందపురం ప్రాంతాల్లో ఆయన కోసం పోలీసులతో పాటు కుటుంబ సభ్యులు వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఆనందపురం, బోయపాలెం ప్రాంతాల్లో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. బోయపాలెం నుంచి కాపులుప్పాడ వైపు ఓ గుర్తు తెలియని వ్యక్తితో అప్పన్న ద్విచక్ర వాహనం(పల్సర్ 220)పై వెళ్లినట్లు గుర్తించారు. దీంతో బోయపాలెం, పరదేశిపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెతికారు. కాపులుప్పాడ ఆర్‌ఎస్‌పీ లేఅవుట్‌లో బుధవారం గాలించగా.. అక్కడ ఓ వ్యక్తి ఎముకలు, పుర్రె వంటివి చెల్లాచెదురుగా కనిపించాయి. వెంటనే దుర్గాప్రసాద్ భీమిలి పోలీసులకు సమాచారం అందించారు.

అప్పన్నగా గుర్తింపు

సంఘటనా స్థలంలో కేవలం పుర్రె, ఎముకలు వంటివి కాలిపోయి ఉన్నాయి. వాటి పక్కనే మెడలో వేసుకునే పూసలు, సగం కాలిన దుర్గాదేవి ఫొటో, పంచె ఆధారంగా కుటుంబ సభ్యులు అప్పన్నగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి ఇక్కడకు తీసుకుని వచ్చి, హత్య చేసి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



సంఘటనా స్థలంలో పూసలు, సగం కాలిన పంచె





అప్పన్న (ఫైల్)

కాల్ డేటానే కీలకం?

అప్పన్న తమ్ముడు కుమార్తె పెళ్లికి సంబంధించి ఆహ్వాన పత్రికలు అందజేసేందుకు ఈ నెల 8న అప్పన్న వారి కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లాడు. తిరిగి అదే రోజు రాత్రి ఇంటికి చేరుకున్న అప్పన్న.. ఫోన్లో ఎవరితో గట్టిగా మాట్లాడి వాగ్వాదానికి దిగినట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. తమకు ఎటువంటి అప్పులు లేవని, సంతోషంగా జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 8వ తేదీన రాత్రి ఫోన్ వచ్చిందని, ఆ తర్వాత రోజున అప్పన్న కనిపించకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. అప్పన్న కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేయాలని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు. సమాచారం అందుకున్న నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు. క్లూస్ టీం వివరాలు సేకరించిందని, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు అస్థిపంజరాన్ని పంపిస్తున్నట్లు తెలిపారు. అప్పన్న చనిపోయి 4, 5 రోజులు అయి ఉంటుందని, శరీరం సగం కాలడంతో పలు భాగాలను కుక్కలు చెల్లా చెదురుగా తీసుకుపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. భీమిలి సీఐ సుధాకర్ కేసు నమోదు చేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో

నాణ్యతకు పెద్దపీట

- కలెక్టర్ హరేందిరప్రసాద్

మహారాణిపేట

ఎన్టీఆర్ కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్‌చార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అన్ని ఇళ్లను పూర్తి చేసే విధంగా తగిన కార్యాచరణ రూపొందించుకొని పనులను సాగించాలని చెప్పారు. అనకాపల్లి జిల్లా కుంచంగి, సబ్బవరం మండలం పెదముషిడివాడలో స్థానికుల నుంచి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని, పనులు ముందుకు సాగటం లేదని హౌసింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేఅవుట్ పరిధిలో ఉన్న గ్రావెల్‌ను తవ్వుకొని అక్కడి పనులకు వాడుకుంటున్నప్పటికీ స్థానిక అధికారులు అభ్యంతరాలు తెలుపుతున్నారని వివరించగా మైన్స్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, డీఈలు సూర్యారావు, నారాయణ ప్రసాద్, లేఅవుట్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఏడీసీ రమణమూర్తి, యూసీడీ పీడీ సత్యవేణి, డీసీవో ప్రవీణ, ఎస్‌డీసీలు శేష శైలజ, సునీత పాల్గొన్నారు.

లైంగిక దాడుల కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు

- ఆదేశించిన డీఐజీ గోపీనాథ్ జెట్టీ



సాక్షి, విశాఖపట్నం: మహిళలపై జరుగుతున్న నేరాలు, అఘాయిత్యాలు, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని డీఐజీ గోపీనాథ్ జట్టీ అన్నారు. వీటిపై ఎస్పీలు ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, నిందితులపై కేసులు నమోదు చేసి త్వరితగతిన శిక్షలు పడేలా సీఐ, ఎస్‌ఐలు పనిచేయాలని ఆదేశించారు. అలాగే, నేరాల నియంత్రణ, బాధితులకు న్యాయం కల్పించే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం విశాఖ రేంజ్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం జిల్లాల ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గంజాయి నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్.బి.డబ్ల్యూ అమలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసులు, హేయమైన నేరాలు సంబంధించిన కేసుల పై సమీక్ష నిర్వహించారు. గంజాయి నిందితుల ఆస్తుల స్వాధీనానికి, పీడీ యాక్ట్ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

అద్దాల గూళ్లలో లవ్ బర్డ్స్



జూలో లవ్ బర్డ్స్ కొత్త ఎన్‌క్లోజర్

- ఇందిరాగాంధీ జూపార్క్‌లో సరికొత్త ఆకర్షణ

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో లవ్ బర్డ్స్ జోన్ కొత్త సొబగులు సంతరించుకుంది. జూ పార్కు ఏర్పాటు చేసిన సమయంలో పక్షుల కోసం ప్రత్యేకంగా జోన్ నిర్మించారు. అందులో వివిధ గూళ్లలో రకరకాల లవ్ బర్డ్స్‌ను పెట్టారు. ఆ గూళ్ల చుట్టూ రెండు వరుసల్లో ఇనుప మెష్‌లు ఉండటంతో సందర్శకులకు వాటి అరుపులు తప్ప పక్షులు సరిగా కనిపించేవి కాదు. దీంతో జూ అధికారులు ఇటీవల ఈ జోన్‌ను ఆధునికీకరించారు. ఇనుప మెష్‌లను తొలగించి.. వాటి స్థానంలో కొత్తగా అద్దాలతో గూళ్లు నిర్మించారు. వాటికి గాలి, వెలుతురు తగిలేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు అద్దాల లోపల పక్షులు సందర్శకులకు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



జూలో పాత ఎన్‌క్లోజర్(ఫైల్)

జైలులో శానిటరీ నాప్కిన్ తయారీ యూనిట్



సెంట్రల్ జైలులో శానిటరీ నాప్కిన్ తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో మహిళా ఖైదీల కోసం శానిటరీ నాప్కిన్ తయారీ యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీన్ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్‌ను బుధవారం జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్ని మహిళా ఖైదీల బ్లాక్ వద్ద ఏర్పాటు చేశామన్నారు. మహిళా ఖైదీల ఆరోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకుని దీని ఏర్పాటుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ యూనిట్‌లో మహిళా ఖైదీలే పనిచేస్తారని, వారికి ఈ యూనిట్ ఆర్థికంగా కూడా సహాయపడుతుందన్నారు. ఇక్కడ తయారైన నాప్కిన్లను భవిష్యత్‌లో రాష్ట్రంలో ఇతర జైళ్లకు సరఫరా చేసే చర్యలు చేపడతామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయి ప్రవీణ్, సూర్యకుమార్, జవహర్‌బాబు, జైలర్లు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒడిశాలో హత్య.. ఇక్కడ నిందితుల అరెస్ట్



సుజిత్ బెంగ్రా



మున్నా సన్యాసి

పీఎంపాలెం: ఒడిశా రాష్ట్రంలోని సుందర్‌గఢ్ జిల్లా రాజ్‌గంగ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని బుధవారం పీఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. ఒడిశాకు చెందిన సుజిత్ బెంగ్రా, మున్నా సన్యాసి ఓ హత్య చేసిన కేసులో ప్రధాన నిందితులు. పీఎంపాలెం బాబా ఇంజినీరింగ్ కాలేజీ ఏరియాలో నిందితుల్లో ఒకరి చెల్లెలు నివసిస్తోంది. ఒడిశా పోలీసుల నుంచి తప్పించుకోవడానికి కొన్ని రోజులుగా నిందితులు ఆమె వద్ద తలదాచుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఒడిశా పోలీసులు సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా నిందితుల ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఒడిశా తీసుకెళ్లారు.

ఆరుగురు జైలు అధికారులకు మెమోలు

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో ప్రక్షాళన చర్యలు జరుగుతున్నాయి. రాష్ట్ర జైళ్ల శాఖ అధికారులు ఆరుగురికి మెమోలు జారీ చేశారు. బుధవారం ఇద్దరికి, మంగళవారం నలుగురికి మెమోలు జారీ చేశారు. ఇటీవల ఇక్కడ పాలన విభాగం అస్తవ్యస్తంగా మారి వార్తలకెక్కిన విషయం తెలిసిందే. జైలు లోపలకు గంజాయి తరలించడం, ఖైదీల బేరక్ వద్ద సెల్‌ఫోన్‌లు లభించడం, ఓ రిమాండ్ ఖైదీని క్వారెంటైన్‌లో ఉంచకుండా నేరుగా బేరక్‌లోకి తరలించడంతో ఆత్మహత్య చేసుకోవడం తదితర పరిణామాలు జరిగాయి. ఆయా వ్యవహారాల్లో పలువురు అధికారులకు బదిలీలు కూడా జరిగాయి. పరిపాలన యంత్రాంగాన్ని గాడిన పెట్టడానికి రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా దర్యాప్తు చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, ఉన్నతాధి కారుల ఆదేశాలు సక్రమంగా అమలు చేయకపోవడం తదితర విషయాలు దర్యాప్తులో వెల్లడయ్యాయి. దీంతో అధికారులపై చర్యలు చేపట్టారు. బుధవారం జైలర్లు పి.కుసుకుమార్, ఆర్.చిన్నారావుకు మెమోలు జారీ చేయగా.. మంగళవారం గతంలో ఇక్కడ పనిచేసిన సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు, జైలర్ సీహెచ్ శ్రీనివాస్‌కు రాష్ట్ర జైళ్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజిత్ మెమోలు జారీ చేశారు. ఇంకొందరికి మెమోలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

బాల్‌బ్యాడ్మింటన్ ఆటగాళ్లకు ప్రశంసలు

విశాఖ స్పోర్ట్స్: సీనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సాధించడంలో ప్రతిభ చూపిన ఈకో రైల్వేకు చెందిన ముగ్గురు ఆటగాళ్లను డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ అభినందించారు. ఈ టోర్నీలో సీహెచ్ వెంగళరావు చక్కటి ప్రతిభ కనబరిచి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకున్నారు. డి.వి.గణేష్, పి.కార్తీక్ సత్తా చాటారు. వాల్తేర్ డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వాల్తేర్ ఈకో రైల్వే స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ బాటి, సంయుక్త స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

24న హతియా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌కు థర్డ్ ఏసీ కోచ్ జత

తాటిచెట్లపాలెం: హతియా-ఎర్నాకుళం (22837) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24న ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు ఈ కోచ్‌ను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసియా గోల్ఫ్ పోటీల్లో విజేతకు సత్కారం



అదిత్‌ను సత్కరిస్తున్న సింహాద్రి టీఎంటీ ఎండీ సురేష్‌కుమార్

దాబాగార్డెన్స్: ఆసియా జూనియర్ మాస్టర్ గోల్ఫ్ పోటీల్లో నగరానికి చెందిన అదిత్ వీరమాచనేని సత్తా చాటాడు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో అదిత్ అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచాడు. గతేడాది థాయిలాండ్‌లో జరిగిన టోర్నీలో కూడా అదిత్ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా అదిత్‌కు సింహాద్రి టీఎంటీ మేనేజింగ్ డైరెక్టర్ బండి సురేష్‌కుమార్ జ్ఞాపిక అందించి సత్కరించారు.

9,300 కేసులు.. రూ.46 లక్షల జరిమానా

- వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్



ప్రత్యేక డ్రైవ్‌లో టికెట్ తనిఖీలు చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ నెల 12న డ్రైవ్ ప్రారంభం కాగా.. ప్రయాణికుల భద్రతా ప్రమాణాల పరిశీలన, టికెట్ తనిఖీలు చేపడుతున్నారు. సరైన టికెట్ లేకుండా రిజర్వేషన్, దివ్యాంగ, మహిళల బోగీల్లో ప్రయాణిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నెల 18 వరకు కమర్షియల్ సిబ్బంది 9,300 కేసులు నమోదు చేసి, రూ.46 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ నెల 28వ వరకు తనిఖీలు కొనసాగుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

రఘువర్మకు టీడీపీ మద్దతు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

చార్‌ధామ్ చూసొద్దామా

- మే 8 నుంచి భారత్ గౌరవ్ ప్రత్యేక రైలు యాత్ర



యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్తరాఖండ్ అధికారి వీరేందర్ సింగ్, రమేశ్ అయ్యంగార్

సీతమ్మధార: చార్‌ధామ్ యాత్రకు వెళ్లాలనుకునే వారి కోసం మొదటి 'భారత్ గౌరవ్' ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వ యూనిట్ గఢ్వాల్ మండల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(జీఎంవీఎన్) ప్రజా సంబంధాల అధికారి వీరేందర్ సింగ్ రాణా తెలిపారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ ప్రత్యేక పర్యాటక రైలు హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. 16 రోజుల పూర్తి స్థాయి ప్యాకేజీ టూర్ ఈ ఏడాది మే 8న ప్రారంభమవుతుందని, ప్రస్తుతం బుకింగ్‌లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రతీ కోచ్‌లో ఎంటర్‌టైన్‌మెంట్, సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్ కీపింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది ఉంటారని వివరించారు. టూర్ టైమ్స్ రీజినల్ మేనేజర్ రమేశ్ అయ్యంగార్ మాట్లాడుతూ భారతీయ రైల్వేలు, టూర్ టైమ్స్ భాగస్వామ్యంతో ఈ పవిత్ర యాత్రను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక ప్యాకేజీలో సైట్ సీయింగ్, రాత్రి బస ఉన్న ప్రాంతాల్లో హోటల్ వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. యాత్ర మొత్తంలో రైలు, హోటళ్లలో దక్షిణ భారతీయ భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు తమ లగేజీని కోచ్‌లోనే ఉంచుకుని యాత్రా స్థలాలను సందర్శించవచ్చని, ఇది యాత్రను మరింత సౌకర్యవంతంగా మారుస్తుందన్నారు. వృద్ధులకు ఇది ఒక ప్రత్యేకమైన టూర్ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ, ఎల్‌ఎఫ్సీ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చని, రైల్వే మంత్రిత్వ శాఖ 33 శాతం రాయితీని అందిస్తోందన్నారు. రాయితీ పోనూ థర్డ్ ఏసీకి రూ.70,500, సెకెండ్ ఏసీకి రూ.75,500, ఫస్ట్ ఏసీకి రూ.82,500, స్లీపర్‌కు రూ.58,500 చార్జీలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. బుకింగ్, ఇతర సమాచారం కోసం www. tourtimes. in వెబ్‌సైట్‌ను, 91600 21414, 91600 91414 నంబర్లను సంప్రదించవచ్చు. సమావేశంలో ఫిజిషియన్, సైకియాట్రిస్ట్ నందిని పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

సీతమ్మధార: ఆప్కాస్‌ను రద్దు చేస్తే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రైవేట్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అప్పగించొద్దని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించింది. సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి, వినతి పత్రం అందించింది. యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ ఆప్కాస్ కంటే మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా డెత్, రిటైర్మెంట్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలన్నారు. ఎంప్లాయి పదాన్ని ఆప్కాస్ నుంచి తొలగించి, ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరారు. 62 ఏళ్ల రిటైర్మెంట్ వయసు, గత సమ్మె ఒప్పందం ప్రకారం ప్రమాద మరణానికి రూ.7 లక్షల పరిహారం, పెరిగిన జనాభా ఆధారంగా సిబ్బంది పెంపు తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జీఆర్ నాయుడు, శీర రమణ, ఇ.అదినారాయణ, గణేష్, ఈశ్వరరావు, శ్రీను, బాలు, వరలక్ష్మి, పద్మ, లలిత, రాజశేఖర్, వెంకటరావు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎగుమతిదారులకు ప్రోత్సాహం

- రూ.60 కోట్ల మేర 79 ఒప్పందాలు



ఒప్పందాలు చేసుకుంటున్న ప్రతినిధులు

మహారాణిపేట: మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఐఈఓ) సహకారంతో నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సదస్సు బుధవారం ముగిసింది. గత రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో 18 దేశాలకు చెందిన 25 మంది కొనుగోలుదారులు, 430 మందికి పైగా ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, రెడీమేడ్ వస్త్రాలు, కాస్మోటిక్స్, ఫార్మా తదితర రంగాలకు చెందిన 79 అవగాహన ఒప్పందాలు జరిగాయి. సుమారు రూ. 60 కోట్ల మేర వ్యాపార ఒప్పందాలు చేసుకున్నారు. ఈ సదస్సులో 38 మంది కొత్త ఎగుమతిదారులకు ప్రోత్సాహం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో ఎం.విశ్వ, ఎఫ్‌ఐఈవో దక్షిణ రీజినల్ చైర్మన్ గోపాలకృష్ణన్, జాయింట్ డైరెక్టర్ జనరల్ ఉన్ని కృష్ణన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు పాల్గొన్నారు.